క్లుప్తంగా

'వైఎస్సార్ కళ్యాణమస్తు' మంజూరు



లబ్ధిదారులకు నగదు అందజేస్తున్న సర్పంచ్ నర్సింహమూర్తి

గుర్ల: మండలంలోని జమ్ము సచివాలయంలో వైఎస్సార్ కళ్యాణమస్తు లబ్ధిదారులకు రూ.50వేల నగదును సర్పంచ్ గొర్లె నర్సింహమూర్తి శుక్రవారం అందజేశారు. జమ్ము గ్రామానికి చెందిన మండల సౌజన్య, జమ్ము సుభాష్‌లకు ఇటీవల వివాహం జరిగింది. వధూవరులిద్దరూ వైఎస్సార్ కళ్యాణమస్తు పథకం కోసం దరఖాస్తు చేసుకోగా.. ప్రభుత్వం నుంచి రూ.50 వేలు ఆర్థికసాయం మంజూరైంది. ఈ మొత్తాన్ని సర్పంచ్ నర్సింహమూర్తి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు జమ్ము రామ్మూర్తి, పంచాయతీ కార్యదర్శి దివాకర్, సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలం కోడూరు పంచాయతీ పరిధి రిక్షాకాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి ఎ.విశ్వేశ్వరరావు, ఎంపీడీఓ జి.భాస్కరరావు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రంలోని రికార్డులు, సరుకుల నిల్వలను పరిశీలించారు. కేంద్రానికి రోజూ ఎంతమంది చిన్నారులు హాజరవుతున్నారు, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నారా లేదా అని ఆరాతీశారు. వారి వెంట సూపర్‌వైజర్ సుభాని ఉన్నారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

గుర్ల: ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు అన్నారు. భూపాలపురం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సూచించినట్లు పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్య సూచనలు పాటించాలన్నారు. రక్తహీనతతో బాధపడకుండా చేయడానికి ప్రభుత్వం పౌష్టికాహార కిట్లు అందిస్తోందన్నారు.

గృహసారథులకు బీమా సౌకర్యం

బొండపల్లి: ప్రతీ గ్రామంలో వైఎస్సార్‌సీపీ నియమించిన గృహసారథులకు జీవిత బీమా సౌకర్యం కల్పించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకోవడం జరిగిందనిగ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ పల్లి రఘు అన్నారు. మండలంలోని గరుడబిల్లి గ్రామంలో శుక్రవారం గృహ సారథులకు బీమా సౌకర్యంపై అవగాహన కల్పించారు. బీమాను పొందేందుకు ఏవిధంగా పేరు, వివరాలు నమోదు చేసుకోవాలో వివరించారు. గృహసారథుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఓ జి.శ్రీకాంత్, ఉప సర్పంచ్ గౌరీశంకర్, పార్టీ జిల్లా నాయకులు బోద్దల చిన్నంనాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

చీపురుపల్లిరూరల్(గరివిడి): సమతుల ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, గర్భిణులు, బాలింతలు తీసుకునే ఆహారంలో పోషకాలు సమృద్ధిగా ఉండేలా చూసుకోవాలని గరివిడి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఎస్.ఆరుద్ర అన్నారు. గరివిడి పట్టణంలోని బీపీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు రెండేళ్లు వచ్చేంత వరకు తీసుకోవాల్సిన ఆహార, ఆరోగ్య నియమాలను వివరించారు. ఆకుకూరలు, కాయగూరలతో కూడిన సమతుల ఆహారాన్ని తీసుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.సుబ్బలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త భవాని పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పించండి

మెరకముడిదాం: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 30న ప్రారంభించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై గ్రామాల్లో వలంటీర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని మండల ప్రత్యేకాధికారి శ్రీధర్‌రాజ అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలానికి చెందిన అన్ని శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి స్పెషలిస్ట్ వైద్యులచే వైద్య సేవలందించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆయా శాఖల పనితీరుపై సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈకి సూచించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చీపురుపల్లి రూరల్: మండలంలోని కర్లాం వెంకటరామ ఫ్యాక్టరీస్‌లో పనిచేస్తున్న కార్మికులు తమ సమస్యలను వెంటనే పరిష్కరించేలా ఫ్యాక్టరీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఫ్యాక్టరీ ఫారంలో 175 మంది కార్మికులం పనిచేస్తున్నామని, వేతన ఒప్పంద కాలపరిమితి ముగిసిందని, అప్పటినుంచి నూతన ఒప్పందం కోసం యాజమాన్యంతో పలుమార్లు చర్చలు జరిపినప్పటికీ అంగీకరించలేదని వాపోయారు. మగ కార్మికుడికి రూ.15 వేలు, ఆడ కార్మికులకు రూ.12 వేలు వేతనం అందించాలని డిమాండ్ చేశారు. అధికారులు కలుగజేసుకుని కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరారు.

సంక్షేమాన్ని వివరిస్తూ.. సమస్యలపై ఆరాతీస్తూ..

- ఉత్సాహంగా సాగిన 'గడపగడపకు మన ప్రభుత్వం'
- పాల్గొన్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



కుమ్మపల్లిలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

వేపాడ: మండలంలోని కుమ్మపల్లి సచివాలయం పరిధిలో కుమ్మపల్లి, దొగ్గపేట, బత్తికొంపలు శివారు గ్రామాల్లో శుక్రవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు, అధికారులతో కలిసి గడపగడపకు వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు జరిగిన సంక్షేమ లబ్ధిని వివరించే పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..

పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. చదువుకు పేదరికం అడ్డుకారాదని భావించి జగనన్న అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలను అమలు చేయడంతో పాటు నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించడం జరిగిందన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ఆసరా, సున్నా వడ్డీ, చేయూత వంటి పథకాలతో నేరుగా లబ్ధిదారుల ఖాతాలోనే నగదు జమ చేస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థతో పాలనను ప్రజలకు చేరువ చేశారన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మీ ఆశీస్సులు అందించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపీపీ సత్యవంతుడు, సర్పంచ్ నౌడు అరుణ, పార్టీ మండల అధ్యక్షుడు జగ్గుబాబు, పార్టీ ఉత్తరాంధ్ర పంచాయతీ కన్వీనర్ మెరపల సత్యనారాయణ, మండల జేసీఎస్ కన్వీనర్ బోజంకి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు దొగ్గ శ్రీనివాసరావు, నౌడు శ్రీనివాసరావు, స్వప్నకుమారి, పైడంనాయుడు, నిరుజోగి శ్రీను, శిరికి అప్పలసత్యం, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల ద్వారా యూరియా

- ఎంపీపీ హైమావతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు యూరియా అందించాలని ఎంపీపీ పీరుబండి హైమావతి వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సస్యరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పామాయిల్ తోటల పెంపకం కోసం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. ఖాళీగా ఉన్న కొర్లాం ఆర్‌బీకే అగ్రికల్చర్ అసిస్టెంట్ స్థానాన్ని తక్షణమే భర్తీ చేయాలన్నారు. ప్రతీ రైతు తాను సాగు చేసిన పంట వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. ఆర్‌బీకే సిబ్బంది కచ్చితమైన పంట వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయాలన్నారు. పంటల సాగు వివరాలు తప్పుగా నమోదు చేస్తే తీవ్రమైన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వర్రి నర్సింహమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రంధి రామునాయుడు, లచ్చిరెడ్డి కృష్ణ, ఏఓ బి.శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేత

గంట్యాడ: గ్రామ వలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. బుడతానపల్లి వలంటీర్‌గా ఎంపికైన అభ్యర్థికి శుక్రవారం నియామకపత్రం అందజేశారు. వృత్తి పట్ల అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావడం ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేయాలని, అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు.

వైఎస్సార్ బీమాతో కుటుంబానికి భద్రత



బాధిత కుటుంబానికి రూ.10వేలు చెక్కును అందజేస్తున్న బెల్లాన వంశీకృష్ణ

చీపురుపల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ బీమా పథకంతో పేద కుటుంబాలకు సామాజిక భద్రత లభిస్తుందని బెల్లాన వంశీకృష్ణ అన్నారు. పట్టణంలోని హడ్కోకాలనీలో గుండెపోటుతో మరణించిన బి.నాగరాజు కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయంగా రూ.10 వేలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకస్మాత్తుగా ఇంటి యజమాని మరణిస్తే ఆ కుటుంబం రోడ్డున పడకుండా వైఎస్సార్ బీమా పథకం ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇప్పిలి తిరుమల, గెరిడి రామదాసు, సూరు దుర్గారావు, భాస్కరరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

స్మృతివనం నిర్మాణానికి మట్టి సేకరణ



ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

శృంగవరపుకోట: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల స్మృత్యార్థం ప్రతీ ఇంటి నుంచి చిటికెడు మట్టి సేకరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎం.రవీంద్ర, ఇన్‌చార్జ్ పి.గంగయ్య పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పట్టణంలోని సాయి పైడిమాంబ కళ్యాణ మండపంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల స్మారకార్థం ఢిల్లీలో స్మృతివనం నిర్మాణానికి మోడీ సర్కారు పూనుకుందన్నారు. ఇందుకుగానూ ప్రతీ గ్రామం నుంచి, ప్రతీ ఇంటి నుంచి చిటికెడు మట్టి సేకరించాలని కోరారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో పంచప్రాణ్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దినేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు సుజాతరాజ్, జిల్లా విస్తారక్ మహంతి, నియోజకవర్గ విస్తారక్ భూపతిరావు, ఓబీసీ మోర్చా స్టేట్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కషాయాల తయారీపై అవగాహన



జిల్లేడు ద్రావణం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

వేపాడ: మండలంలో కుమ్మపల్లి గ్రామంలో కూరగాయల సాగు రైతులకు సేంద్రియ ఎరువులు, కషాయల తయారీపై ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ సన్యాసమ్మ శుక్రవారం అవగాహన కల్పించారు. ద్రవజీవామృతం, జిల్లేడు కసాయం, ఇంగువ ద్రావణాన్ని ఎలా తయారు చేయాలో వివరించారు. కూరగాయ పంటలకు వచ్చే తెగుళ్లను నివారించేందుకు ఘన, ద్రవజీవామృతంతో పాటు ఇంగువ ద్రావణం సమర్థవంతంగా పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంటీ త్రినాథ, డెక్క ఈశ్వరరావు, గోకేడ వెంకటరావు, రామస్వామినాయుడు, రమణమ్మ, శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

రూ.17 కోట్లతో ఉపాధి పనులు



సోషల్ ఆడిట్ వివరాలు వెల్లడిస్తున్న ఏపీడీ లక్ష్మణరావు

బొండపల్లి: మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో 2022 ఏప్రిల్ 1 నుంచి 31 మార్చి 2023 మధ్య కాలంలో రూ.17 కోట్లతో ఉపాధి హామీ పథకం పనులు చేపట్టడం జరిగిందని ఆ పథకం జిల్లా ఏపీడీ వీవీఎస్ లక్ష్మణరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించి 17వ విడత సామాజిక తనిఖీల ప్రజావేదిక నిర్వహించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.17 కోట్లతో పనులు చేపట్టగా..అందులో వేతనాల కోసం రూ.15.72 కోట్లు, మెటీరియల్ కోసం రూ.2.60 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. సామాజిక తనిఖీ బృందాలు క్షేత్రస్థాయిలో చేపట్టిన పనులతో పాటు రికార్డులను పరిశీలించడం జరిగిందని, ఎక్కడా ఎలాంటి అక్రమాలు జరగలేదన్నారు. కొత్తగా నియమితులైన మేట్లకు ఈ-మస్టర్ల నమోదుపై మేట్లకు పూర్తిస్థాయిలో అవగాహన లేదని, వారికి శిక్షణ ఇవ్వాలని ఏపీఓ కృష్ణవేణికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి రవీంద్ర, ఉపాధిహామీ పథకం ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ అధికారి కె.భానూజీరావు, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ రామారావు, ఎంపీపీ చల్లా చలంనాయుడు, ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, పీఆర్ జేఈఈ పి.కృష్ణమూర్తి, ఉపాధి క్లస్టర్ ఏపీడీ జనార్దనరావు, ఏపీఓ బి.కృష్ణవేణి, ఈసీ సన్యాసిరావు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ నిర్వహణకు సహకరించాలి

శృంగవరపుకోట: మండల స్థాయి స్కూల్‌గేమ్స్ నిర్వహణకు వ్యాయామోపాధ్యాయులంతా సహకరించాలని ఎంఈఓ బి.నర్సింగరావు కోరారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో మండలంలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులతో శుక్రవారం సమావేశమై స్కూల్ గేమ్స్ నిర్వహణ ఏర్పాట్లపై చర్చించారు. ఈ నెల 11న ఎస్.కోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో అండర్-14 పోటీలు, 12న ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్-17 పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. క్రీడాకారులకు మధ్యాహ్న భోజనాన్ని ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండల కోఆర్డినేటర్ పి.శ్రీరాములు మాట్లాడుతూ మండల స్థాయి స్కూల్‌గేమ్స్‌లో వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, యోగ, అథ్లెటిక్స్, త్రోబాల్ పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి



స్టడీ అవర్స్ నిర్వహణను పరిశీలిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: విద్యార్థులు చక్కగా చదువుకుని పదో తరగతిలో మంచి మార్కులు తెచ్చుకోవాలని ఎంఈఓ-2 బాలభాస్కరరావు అన్నారు. సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. పరీక్షలు సమీపిస్తుండటంతో విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలని, సబ్జెక్టులలో ఏమైనా సందేహాలు ఉంటే తక్షణమే సంబంధిత ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం నాడు-నేడు పనులను పరిశీలించారు.

కొండ ఆక్రమణకు స్కెచ్



మర్రివలస కొండపై జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం

దత్తిరాజేరు: మండలంలోని మరడాం పంచాయతీ మర్రివలస రెవెన్యూ పరిధి సర్వే నంబర్-1లో ఉన్న కొండ వెనుక భాగంలో ఆక్రమణలు చేసేందుకు కొంత మంది స్కెచ్ వేశారు. మెంటాడ మండలం కుంటినవలస గ్రామానికి చెందిన 10 నుంచి 15 మంది జేసీబీలతో గత రెండు రోజులుగా కొండను చదును చేస్తుండడంతో గురువారం స్థానికులు రెవెన్యూ అధికారులు సమాచారం అందించారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీఆర్వో సన్యాసి, వీఆర్‌ఏలు కలిసి కొండపై చదును చేస్తున్న జేసీబీ తాళాలు తీసుకొని పనులు నిలిపివేశారు. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దార్ రమేష్ వద్ద ప్రస్తావించగా ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఎంపీకి కళింగ కోమట్ల వినతి



ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను కలిసిన కళింగ కోమట్ల సంఘ ప్రతినిధులు

చీపురుపల్లి: కళింగ కోమట్లను ఓబీసీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఆ సంఘ ప్రతినిధులు పార్లమెంటు సభ్యులను కోరారు. ఈ మేరకు పట్టణంలోని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ నివాసంలో శుక్రవారం ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కళింగ కోమట్లను ఓబీసీ జాబితాలో చేర్చాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి నివేదించిందన్నారు. రానున్న పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశంపై చర్చించాలని ఎంపీలను కోరారు. ఎంపీని కలిసిన వారిలో సంఘం ప్రతినిధులు ఎస్‌వీజీ శ్రీనివాసరావు, కింతలి మధు, సూరు కుమార్, సూరు కామేష్, అంధవరపు గోవింద, కింతలి వెంకటరావు తదితరులు ఉన్నారు.

గృహ నిర్మాణాల్లో జాప్యం తగదు



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ

వేపాడ: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన గృహాల నిర్మాణంలో లబ్ధిదారులు జాప్యం చేయడం సరికాదని మండల ప్రత్యేకాధికారి పీఎన్‌వీ లక్ష్మీనారాయణ అన్నారు. పాటూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన హౌసింగ్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జగనన్న లేఅవుట్‌లో 18, సొంత స్థలాల్లో 52 గృహాలు మంజూరు కాగా, ప్రస్తుతానికి 44 గృహాల నిర్మాణం పూర్తయినట్లు చెప్పారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని, వాటిని త్వరగా పూర్తిచేసి సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని లబ్ధిదారులకు సూచించారు. బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నామని, ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కారిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు ప్రసన్నకుమార్, ఎంపీడీఓ కూర్మనాథ్ పట్నాయక్, హౌసింగ్ ఏఈ అప్పలనాయుడు, ఉప సర్పంచ్ కొట్యాడ రమణమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుంది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

మెంటాడ (గజపతినగరం రూరల్): రానున్న ఎన్నికల్లో టీడీపీ చిత్తుచిత్తుగా ఓడిపోతుందనే భయం చంద్రబాబుకు పట్టుకుందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఎద్దేవాచేశారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. తనను అరెస్ట్ చేసే అవకాశం ఉందని చంద్రబాబే స్వయంగా చెప్పుకోవడం వెనుక వాస్తవాలు ప్రజలకు ఇప్పటికే అర్థమయ్యిందన్నారు. రూ.118 కోట్లు ముడుపులు తీసుకోవడం బయటకు పొక్కడంతో చంద్రబాబు ఏమీ చేయాలో తెలియక తనను ఏ క్షణమైనా అరెస్ట్ చేసే అవకాశం ఉందని సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసుకుని ప్రజల నుంచి సానుభూతి పొందేందుకు నక్క వినయం ప్రదర్శిస్తున్నారన్నారు. గతంలో ఓటుకు నోటు కేసులో కూడా చంద్రబాబు ఇదేమాదిరిగా ప్రవర్తించారని, ఆ విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. లోకేష్ పాదయాత్రలో మాట్లాడే విధానం సరికాదన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్నకొద్దీ తండ్రీ కొడుకులు ఇద్దరూ అధికారం కోసం లేనిపోని కుతంత్రాలు చేసేందుకు సిద్ధపడుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని అభివృద్ధిని, సంక్షేమాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత నాలుగేళ్లలో చేపట్టిందన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో టీడీపీకి తగిన బుద్ధి చెపుతారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గార తవుడు, పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, ఏఎంసీ చైర్మన్ బూడి ముత్యాలనాయుడు, పార్టీ నాయకులు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, సామంతులు పైడిరాజు, కరణం ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'



మట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని, ఆరోగ్య సిబ్బంది గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలు తెలుసుకోవడంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్నవారికి వైద్య సేవలందించాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల ప్రత్యేకాధికారి ఎస్‌వీకే దుర్గాప్రసాద్ అధ్యక్షతన మండల స్థాయి అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. ఈనెల 7 నుంచి 15 వరకు ఇంటింటికీ వెళ్లి కుటుంబాల వారీగా ప్రజల ఆరోగ్య పరిస్థితులపై సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం మండలస్థాయిలో ప్రత్యేక మెడికల్ క్యాంప్‌లు నిర్వహించి రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించనున్నట్లు చెప్పారు. తహసీల్దార్ డీజీఎస్‌ఎం ప్రసాదరావు, ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్, ఏఓ డి.వెంటరమణ పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి శ్రావ్య

జామి: ఈ నెల 15 నుంచి నిర్వహించే 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జామి, అలమండ పీహెచ్‌సీ వైద్యాధికారులు సామ్రాజ్యలక్ష్మి, శ్రావ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వైద్య ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈనెల 15 నుంచి వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించాలని సూచించారు. 30న సచివాలయం పరిధిలో ఇద్దరు వైద్యాధికారులు, వైద్య నిపుణులతో వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్‌ప్రేమ్‌కుమార్, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

ఏటీఎంలో నగదు చోరీపై ముమ్మర దర్యాప్తు

దత్తిరాజేరు: పెదమానాపురం సంతలో ఉన్న ఇండియా-వన్ ఏటీఎంలో నగదు చోరీపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇన్‌చార్జ్ ఎస్సై గంగరాజు, ఆంధ్ర ఎస్సై సిద్దార్థకుమార్ ఘటనా స్థలానికి చేరుకుని సంతలో ఉన్న సీసీ కెమెరాల్లో ఉన్న పుటేజీలను పరిశీలించారు. దొంగలు ఎటువైపు నుంచి వచ్చారు, ఎక్కడెక్కడ రెక్కీ నిర్వహించారు, ఎవరిని కలిశారు, తదితర వివరాలపై ఆరా తీస్తున్నారు. అన్ని కోణాల్లో కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైలు తెలిపారు. పాత నేరస్తుల నుంచి కూడా సమాచారాన్ని సేకరిస్తున్నట్లు చెప్పారు. చోరీకి పాల్పడిన వారిని త్వరలోనే పట్టుకుంటామన్నారు. కాగా బుధవారం తెల్లవారు జామున సంతలో ఉన్న ఏటీఎంలో దొంగలు పడి రూ.11.96 లక్షలు నగదు ఎత్తుకెల్లారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ కొనసాగింపు

చీపురుపల్లి: వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం కొనసాగిస్తూ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ నుంచి జీఓ-650 విడుదలైంది. ప్రస్తుతం ఉన్న వ్యవసాయం మార్కెట్ కమిటీ సభ్యులను మరో ఏడాది పాటు కొనసాగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా దన్నాన జనార్దనరావు, వైస్ చైర్మన్‌గా సత్తివాడ అప్పారావుతో పాటు మరో 12 మంది సభ్యులు 2024 సెప్టెంబర్ వరకు పదవిలో కొనసాగనున్నారు. చైర్మన్ జనార్ధనరావు మాట్లాడుతూ..మార్కెట్ కమిటీని అభివద్ధి పదంలో నడిపించేందుకు మరోసారి అవకాశం ఇచ్చినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు



బొండపల్లి: రాజరాజేశ్వరీ దేవికి పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి/జామి/శృంగవరపుకోట: శ్రావణ మాసం నాలుగో శుక్రవారం సందర్భంగా దేవీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. జామి మండల కేంద్రంలో ఉన్న కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించారు. గ్రామానికి చెందిన చుక్క సన్యాసినాయుడు దంపతులు అమ్మవారికి వెండి కిరీటం అందజేశారు. అదేవిధంగా స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని ఆర్యవైశ్య మహిళలు పండ్లు, పసుపుకొమ్ములతో అలంకరించి పూజలు చేశారు. ఎస్.కోట పట్టణంలోని దేవీచౌక్‌లో ఉన్న దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని నిమ్మకాయలతో మహాదుర్గగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, లలితా సహస్రనామ పారాయణం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.



జామి: పుసుపుకొమ్ముల అలంకరణలో కనకదుర్గ అమ్మవారు



జామి: పండ్లు, పసుపు కొమ్ముల అలంకరణలో వాసవీమాత



ఎస్.కోట: మహాదుర్గా దేవిగా దుర్గమ్మ